## క్లుప్తంగా

### వేడుకగా సీతారాముల పెళ్లిరాట



శ్రీరాముని పెళ్లి రాటను ముస్తాబు చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా తిమ్మాపురం సీతారామాలయంలో ఆదివారం పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిరివద్ద పెళ్లి రాట వేశారు. గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

### ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు



వేణుగోపాల రావు, ఎంఈవో

మునగపాక : విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచిత ప్రవేశాలు కల్పించనున్నట్టు ఎంఈవో వేణుగోపాల రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయమై మండలంలోని పలు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించినట్టు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతీ పాఠశాలలో 25 శాతం మేర ప్రవేశాలు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పేద పిల్లలకు అందించాలన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్‌లో అన్ని ప్రయివేటు యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆయా పాఠశాలలను ఎన్నుకోవాలని సూచించారు.

### ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



నారాయుడుపాలెంలో సాగులో ఉన్న మొక్కజొన్న

మునగపాక : మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. వాడ్రాపల్లి, నారాయుడుపాలెం, ఉమ్మలాడ, పాటిపల్లి తదితర గ్రామాల్లో 85 ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఆశించిన ఆదాయం వచ్చే మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నీటి సదుపాయం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా రైతులు మొక్కజొన్న సాగుకు ముందుకొస్తున్నారు.

### మోదకొండమ్మ సన్నిధిలో గురవయ్య యాదవ్



గురవయ్యయాదవ్‌కు అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

మాడుగుల : స్థానిక మోదకొండమ్మను తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకుల ద్వారా అమ్మవారికి రూ.10,116 నగదును అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు శాలువా కప్పి, జ్ఞాపిక అందించి గురవయ్యను గౌరవించారు. ఆయన వెంట స్థానిక యాదవ్ నాయకులు పాతరపల్లి రాంబాబు పాల్గొన్నారు.

### నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి టౌన్: తాకాశివీధి స్వయంభూ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వీరంతా చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# చింతపండుకు భలే గిరాకీ

- మణుగు రూ.450 నుంచి రూ.600 వరకు పలికిన ధర



దేవరాపల్లి వారపు సంతలో చింతపండు కొనుగోలుకు వచ్చిన ప్రజలు



గిరిజన ప్రాంతం నుండి వచ్చిన చింతపండు

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆదివారం జరిగిన వారపు సంతలో చింతపండుకు భారీ గిరాకీ నెలకొంది. మైదాన ప్రాంత గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతం నుండి అధిక మొత్తంలో చింతపండును రైతులు తీసుకువచ్చారు. ఇక్కడి వారపు సంతలో నాణ్యమైన చింతపండు దొరుకుతుందని నమ్మకం. ఈ నేపథ్యంలోనే ఇక్కడి చింతపండు కొనుగోలుకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ప్రజలు, చిల్లర వర్తకులు భారీగా తరలివచ్చారు. దీంతో వారపు సంత చింతపండు కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మణుగు(సుమారు 10 కేజీలు) చింతపండు నాణ్యత ఆధారంగా రూ.450 నుంచి రూ.600 వరకు ధర పలికింది. ధరలు పెరిగినా కొనుగోలుదారులు సరకు కోసం పోటీలు పడ్డారు. గత వారం రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్ల నుండి చింతపండు రాలి తడిసిపోవడంతో కొంత మేర రైతులు నష్టపోయారు. అయితే పెరిగిన ధరలు వారికి కొంత ఊరటనిచ్చాయి.

## మహిళా పక్షపాతి సీఎం జగన్



మాట్లాడుతున్న బీసీ సెల్ విభాగం మండలాధ్యక్షుడు జగన్

మునగపాక: మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ మండలాధ్యక్షుడు కాండ్రేగుల జగన్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆదివారం రాత్రి తిమ్మరాజుపేటలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ శరగడం అప్పలరసమ్మ, పార్టీ నేతలు ఆడారి గణేష్, రామభద్రనాయుడు, కృష్ణారావు మాస్టారు పాల్గొన్నారు.

### సచివాలయ భవనం ప్రారంభం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు మండల ఇంజినీర్ దుర్గాశంకర్ ఆదివారం తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతారన్నారు. గ్రామ స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు.

### 900 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాంబిల్లి: ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాధాస్వామి సత్సంగ్ ఆధ్వర్యంలో ఆదివారం రాంబిల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య సేవలందించారు. 900 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, రక్త, బీపీ పరీక్షలను ఉచితంగా చేశారు.

## ఆపద మిత్రలుగా శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో జ్ఞాపికలు అందుకుంటున్న వలంటీర్లు

ఎస్.రాయవరం : స్థానిక తిమ్మాపురం, వాకపాడు సచివాలయ వలంటీర్లు ఆపద మిత్రలుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. సామర్లకోట ఈటీసీలో ఈ నెల 14 నుంచి 25 వరకు ఆపద మిత్ర శిక్షణ కోసం వీరు వెళ్లారు. విపత్తులు, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవడంతోపాటు, ప్రజల్ని ఎలా రక్షించాలో అనే అంశంలో శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తిమ్మాపురం వలంటీర్ చెక్కా అరుణ్‌కుమార్, గెద్దపు బాలకృష్ణ, వాకపాడు వలంటీర్ బిక్కవోలు రాము శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో బెస్ట్ స్పీకర్‌గా రాము, బెస్ట్ విలేజ్ మ్యాపింగ్ కేటగిరీలో అరుణ్‌కుమార్ శిక్షణ కేంద్రం ప్రతినిధుల నుంచి అవార్డులు పొందారు. దీంతో స్థానిక గ్రామాల నాయకులు, మండల వలంటీర్ల సంఘం అభినందనలు తెలిపారు.

## లో లెవెల్ బ్రిడ్జితో ఇక్కట్లు



మునగపాక కొత్త మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం దగ్గర్లోని లో లెవెల్ బ్రిడ్జి

మునగపాక : మునగపాకలో కృష్ణంరాజు కాలువపై లో లెవెల్ బ్రిడ్జి కారణంగా రైతులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువపై గతంలో బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జిపై రైతులు, అలాగే కశింకోట,వెవెదురుపర్తి, పెదపాడు తదితర ప్రాంతాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో బ్రిడ్జిపైకి నీరు వచ్చేస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో తాడు సాయంతో బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలంటూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆక్షేపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలంలోగా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

### నేడు వైఎస్సార్ ఆసరా సమావేశం

పాయకరావుపేట: మండల పరిషత్ ఆవరణలో మూడో విడత వైఎస్సార్ ఆసరా సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన పొదుపు సంఘాల సభ్యురాళ్లకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతారని పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై 5న చలో ఢిల్లీ

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక భవనంలో వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ చట్టం వల్ల రాష్ట్రంలో రైతాంగానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్ల కోత విధించిందన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంత కూలీలకు పనుల్లేక వలస పోతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాము, జి. వరలక్ష్మి, వి.సత్యవతి, ఉమా నారాయణమ్మ, వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము పాల్గొన్నారు.

**చలో ఢిల్లీ విజయవంతం చేయండి**

కశింకోట: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే నెల 5న ఢిల్లీలో తలపెట్టిన కార్మిక- కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన కశింకోటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తోందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

అనకాపల్లిటౌన్: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కార్యకర్తలు పని చేయాలని జిల్లా బూత్‌స్వశక్తి కరుణ అభియాన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బూత్‌స్వశక్తి కరుణ అభియాన్‌లో భాగంగా ఆదివారం పార్టీ నేతలతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ మండల కమిటీలు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో నేతలు, కార్యకర్తలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్.మాధవ్ ప్రజాతీర్పును గౌరవిస్తూ సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నేతలు ప్రకాష్‌రెడ్డి, ఈర్లె శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

### డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం రహదారిలో ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంకన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. మద్యం సేవించిన వాహనచోదకులపై కొరడా ఝుళిపించారు. వాహనచోదకులను బ్రీత్ ఎన్‌లైజర్‌తో పరీక్షించి విడిచిపెట్టారు. పెండింగ్ చలానాలు వసూలు చేశారు.

## ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు

మాడుగుల రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు ఎంఈవో బి.దేముడమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అన్ని సిలబస్‌లలోనూ దీన్ని అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీ లోగా విద్యార్థులు cse. ap. gov. in తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, బలహీనవర్గాలైన ఓసీలకు 6 శాతం సీట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వారికి కేటాయించాల్సిందేనని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు సూచించారు. బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు అర్హతగా వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలుగా నిర్ధారించారు. ఈ పరిమితిలోపున్న వారు ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



ఒక చోట చేరిన 1968-69 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ ఎంజీహెచ్ స్కూల్ ఆవరణలో ఆదివారం 1968-69 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. వీరంతా సుమారు 55 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒరేయ్ ఎలాగున్నావంటూ సరదాగా పిలుచుకుంటూ సంతోషంగా గడిపి తమతమ యోగక్షేమాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ద శివాజీ, రేలంగి సూర్యప్రకాశరావు, కుందు తులసీరాం, ఎం.బి.కె.స్వామి, బుద్ద వీరునాయుడు, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

## నేటి నుంచి చోడమాంబిక పుట్టుక మహోత్సవం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక పుట్టుక మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఈ పండగను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చోడపల్లి పురవీధుల్ని విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. సోమవారం మొదలయ్యే పుట్టుక జాతర మహోత్సవాలు ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 28న జాగరణ, 29న అమ్మవారి ఊరేగింపు, 30, 31 తేదీల్లో భజన, వాలకాలు, ఏప్రిల్ 1న తొలిపూజ, భాగవతం, 2న పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, 3న ఉయ్యాల సేవ, సారె ఊరేగింపు, 4న అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు.

## బ్రాండిక్స్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 475 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 325 మందికి కళ్లద్దాలు అందించారు. 105 మందికి అవసరమైన మందులిచ్చారు. 30 మందికి శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి కంటి పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారితో మాట్లాడి వారికి అవసరమైన అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు.

## పంచాయతీ సమస్యల పరిష్కారానికి ఎంపీ హామీ



ఎంపీ సత్యవతికి తీర్మానం కాపీని అందజేస్తున్న పార్టీ నాయకులు

ఎస్.రాయవరం: అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతికి భీమవరం పంచాయతీ తీర్మానం కాపీని అందజేసినట్టు వైఎస్సార్ సీపీ నాయకులు గరగా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇటీవల గ్రామంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ దృష్టికి గ్రామ సమస్యలు తీసుకువచ్చారు. ఈ మేరకు స్పందించి గోకులపాడు నుంచి భీమవరం వరకు 30 సోలార్‌లైట్లు, భీమవరం నుంచి పెదగుమ్ములూరు వరకు మూడు కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు కలిసి అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయానికి వెళ్లి పంచాయతీ తీర్మానం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మునగపాక గ్రామాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. పలు కుల సంఘాల వారికి అవసరమయ్యే శ్మశాన వాటికలను పంచాయతీ పాలకవర్గం కేటాయించడంలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాకలో అన్ని కులాల వారికి శ్మశాన వాటికలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చేందుకు పాలకవర్గం పాటుపడుతుందన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పాలకవర్గ సభ్యులు, పలు కుల సంఘాల వారు పాల్గొన్నారు.

## అ'పూర్వ' కలయిక



తమకు విద్యాబోధన చేసిన గురువులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-87 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 36 ఏళ్ల తర్వాత ఒక్కటైన విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థి దశలోని మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత తమ బాల్య మిత్రుల్ని కలుసుకోవడంతో ఆనంద భరితులయ్యారు. ఒకరినొకరు గుర్తుపట్టుకుని మరీ పలకరించుకున్నారు. అప్పటి చిలిపి చేష్టల్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల రాకతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు వెంకటజోగయ్య, అమీర్ సాహెబ్, కాశీ శ్రీనివాసరావు, వైవీ రమణ, ప్రస్తుత హెచ్ఎం మోహన్‌రావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

## ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



పాత సీతారామ మందిరం వద్ద రామనామ గానం చేస్తున్న మహిళా బృందం

రోలుగుంట : స్థానిక పాత రామమందిరం వద్ద ఉగాది నుంచి ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ ఆలయ కమిటీతో కలసి ఆదివారం పూజా కార్యక్రమాలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు, రాత్రుళ్లు మహిళా బృందాల చిడతలు, కోలాటాలతో గ్రామంలో ఆధ్యాత్మికత అలముకుంది. ఈ సంర్భంగా ఉత్సవ నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ భద్రాది రామాలయం మాదిరే ఈ గ్రామంలోని రామాలయం ఏక శిలపై నిర్మించినట్టు తెలిపారు. ఈ ఉత్సవాలు 30న సీతారాముల కల్యాణంతో ముగుస్తాయన్నారు. ఆ రోజు భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## నూకాంబిక ఆలయం కిటకిట



కశింకోటలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కశింకోట: కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య నుంచి నెల రోజులకు వచ్చే గంధ అమావాస్య వరకు అమ్మవారిని ఎక్కువ మంది భక్తులు దర్శిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూలదండలు వేసి అందంగా అలంకరించారు. దీంతో నూకాంబిక దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు వేగి శివగణేష్, వేగి రామరాజు తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కశింకోటతోపాటు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో తరలి వచ్చి అమ్మవారి జాతర, గంప జాతరలు జరుపుకొని అన్నదానాలు నిర్వహించి ఆనందంగా గడిపి వెళ్లారు.